క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



యాలాల: మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.17 లక్షలతో ఇప్పటికే గ్రామంలో పలు చోట్ల సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. మంగళవారం కుర్వ గల్లీలో సీసీ పనులను కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక కాంగ్రెస్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మారుతి, శేఖర్, హన్మంతు, చంద్రకాంత్, నర్సింహులు, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ రాజశేఖర్

అనంతగిరి: రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ ధార్మిక సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్‌లోని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు ఇవ్వడం లేదన్నారు. రుణమాఫీ రైతులందరికీ చేయాలన్నారు. ప్రభుత్వం ఇంకా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుంటే ఎలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల గద్దర్‌ను కలిసిన నేతలు



వెన్నెలను సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

పరిగి: నూతనంగా తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్‌గా ఎంపికైన వెన్నెల గద్దర్‌ను జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మాల మహానాడు ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోళ్ల యాదయ్య, అంబేడ్కర్ విజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాజేందర్, రాములు, సుమన్ పాల్గొన్నారు.


ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ శ్రీశైలంయాదవ్‌ను సత్కరిస్తున్న ఖదీర్‌పాషా

బంట్వారం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన బంట్వారం ఎస్ఐ శ్రీశైలంయాదవ్‌ను బీఆర్ఎస్ మైనార్టీ యువ నాయకుడు ఖదీర్‌పాషా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తొర్మామిడి గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే



బంట్వారంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: ఇందిరమ్మ సర్వేను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం ఆయన బంట్వారం మండల కేంద్రంలో సర్వేను పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాల ఇంటికి వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ గోపాల్ ఈజీఎస్ ఎఫ్ఏ రమేశ్ పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. అమరిక ముఖ్యం

ఆధునిక యుగంలో నేరాల ప్రవృత్తి పూర్తిగా మారిపోయింది. పూటకో తీరుతో కేటుగాళ్లు నేరాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు సీసీ కెమెరాల వినియోగం ఉపయుక్తంగా ఉంటుంది.

- నిందితుల గుర్తింపులో 'సీసీ'లు కీలకం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



చంద్రకల్‌లో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ (ఫైల్)

దౌల్తాబాద్: సాంకేతికత రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో అదేస్థాయిలో మోసగాళ్ల సంఖ్య పెరుగుతోంది. గతంలో చదువు లేని కొందరు దొంగతనాలను వృత్తిగా ఎంచుకునే వాళ్లు. ప్రస్తుతం విజ్ఞానవంతులు సైతం దొంగలుగా మారుతున్నారు. గొలుసు దొంగతనాలు మొదలుకుని తాళం వేసిన ఇళ్లలో చోరీలు, ద్విచక్ర వాహనాల తస్కరణ వంటి నేరాలు ఇటీవల తీవ్రమయ్యాయి. అయితే ప్రజలు సాంకేతికతను సక్రమంగా వినియోగించకపోవడంతో దొంగల దర్జాగా దోచుకుంటున్నారు. నిందితుల చిత్రాలు లభించక పోలీసులు దొంగలను పట్టుకోవడంలో శ్రమపడాల్సి వస్తోంది. దీంతో సీసీ కెమెరాల ఆవశ్యకతపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. వీటి వినియోగంతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు.

తక్కువ ఖర్చుతో ఏర్పాటు

ఒక్క సీసీ కెమెరా పది మంది పోలీసులతో సమానం. ఎక్కడైనా చోరీలు, ప్రమాదాలు వంటివి చోటుచేసుకుంటే నిందితులను తక్షణం గుర్తించడంతో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తాయి. పోలీసులు వారం రోజుల్లో చేయాల్సిన దర్యాప్తు వీటి ఉపయోగంతో ఒక్క రోజులోనే పూర్తి చేసే వీలుంటుంది. పైగా వీటి వినియోగం భారం కాదు. రూ.30 వేల నుంచి సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. మన సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసి బయటకు వెళ్లినా ఇళ్లు, కార్యాలయాలను ఓ కంట కనిపెడుతూ ఉండవచ్చు. అత్యవసర సమయాల్లో సైతం నిఘా నేత్రాలు ఉపయుక్తంగా ఉంటాయి. ఇటీవల మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో సీసీ కెమెరాల ఉపయోగంపై గ్రామస్తులకు పోలీసులు అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సీసీ కెమెరాల వినియోగం ఎంతో అవసరం. ఇంటిని సంరక్షించడంతో పాటు పలు కేసుల దర్యాప్తులో కీలకంగా ఉంటాయి. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పించాం. కొన్ని గ్రామాల్లో ఇళ్లలో ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– రవిగౌడ్, ఎస్ఐ, దౌల్తాబాద్

అభివృద్ధి పనులకు వేళాయె

26న దుద్యాల్‌లో పోలీస్‌స్టేషన్, ఆరోగ్య కేంద్రాల ప్రారంభం



హకీంపేట్‌లో ప్రారంభానికి సిద్ధమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దుద్యాల్: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్ మండలం సిద్ధమవుతోంది. రోడ్ల విస్తరణ, నూతన రోడ్లు వేయడం, సమీకృత మండల కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కళాశాల, పాఠశాలల భవనాలు, ప్రహరీల నిర్మాణాలు మంజూరు చేయడంతో పాటు వాటికి శంకుస్థాపనలు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26న ఈ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు కడా అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కొంత కాలంగా సన్నాహాలు జరగగా తాత్కాలికంగా పల్లెదవాఖానా భవనంలో ఏర్పాటు చేయనున్నారు. అలాగే మండల పరిధిలోని హకీంపేట్‌లో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. మండల కేంద్రంలో రూ.8.50 కోట్లతో మండల సమీకృత భవనాలు ఏర్పాటుకు, హకీంపేట్‌లో రూ.64 లక్షలతో పాఠశాల ప్రహరీ నిర్మాణం కోసం భూమి పూజలు చేయనున్నారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎవరొస్తారనే విషయంపై సందిగ్ధం నెలకొంది.

జానపద కళాకారులకు సత్కారం



సన్మానం పొందుతున్న జిల్లా జానపద కళాకారులు

బొంరాస్‌పేట: తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయిలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేవీ రమణాచారి, రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు సోమవారం రాత్రి సన్మానం చేశారు. ఈ మేరకు సారిపల్లి కొండలరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 33 జిల్లాల నుంచి హాజరైన జిల్లాల నాయకులకు సన్మానం, నగదు పురస్కారం అందజేశారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి గౌరవాధ్యక్షులు అంజిలప్ప లలిత, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య విజయలక్ష్మి దంపతులకు సన్మానంతో పాటు రూ.2వేల చొప్పున నగదు పురస్కారం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు వెనెల గద్దర్, సారిపల్లి కొండల్ రావు, రాష్ట్ర సంగీత, నాట్య అకాడమి అధ్యక్షురాలు ప్రొఫెసర్ అలేఖ్య పుంజలి, సంఘం రాష్ట్ర మహిళాధ్యక్షురాలు విజయశ్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి డప్పు స్వామి, దైవజ్ఞ శర్మ తదితరులు సన్మానించారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



పరిగి: అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్

పరిగి: బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంతో అడ్డగోలుగా మాట్లాడిన అమిత్‌షాపై కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్‌లో హోం మంత్రి పదవిలో ఉండి అంబేడ్కర్‌పై ఇలా మాట్లాడటం సరికాదన్నారు. వెంటనే అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, కుల్కచర్ల ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు సత్యనారాయణ, శ్రీను, ఆంజనేయులు, చిన్ననర్సింహులు పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి

యాలాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మండల నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ఉన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన వ్యక్తి పట్ల అమిత్ షా అనుచితంగా మాట్లాడటం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్, అక్బర్‌బాబా, భీమప్ప, హన్మంతు, మహిపాల్, అమృతప్ప, మధుసూదన్‌రెడ్డి, రఘురాంరెడ్డి, అశోక్ నాయీ, శేఖర్, ఉమేష్, బలరాం, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.



యాలాల: బాబాసాహెబ్ విగ్రహం ఎదుట..

రైతుల సంక్షేమానికి కృషి

బషీరాబాద్: రైతుల సంక్షేమానికి మార్కెట్ కమిటీ కృషి చేస్తుందని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పత్తి పంట విక్రయాలతో రూ.1.20లక్షల ఆదాయం సమకూరాయన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో రైతాంగానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. నూతన ఏఎంసీ కార్యాలయం, ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని తీర్మానించి, జిల్లా మార్కెటింగ్ శాఖకు పంపినట్లు తెలిపారు. మరోవైపు ప్రభుత్వం రైతులకు రుణాల నుంచి విముక్తి చేసిందని, ఖాతాల తప్పులతో మాఫీ కాని రైతులకు సైతం అయ్యేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చందర్ నాయక్, కార్యదర్శి అబీబ్‌అల్వీ, డైరెక్టర్లు హన్మంతు, మునీరు, మహేందర్‌రెడ్డి, సత్యానందం, నరేష్, అనూప్‌ప్రసాద్, నరేష్‌రాథోడ్, వనమాల, మోహన్, దామర్‌చెడ్ నరేష్, పెంటప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు.. దుర్వాసనతో పరుగు

తాండూరు రూరల్: పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో మురుగు పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మంగళవారం మండలంలోని చెంగోల్ గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట మురుగు ఏరులై పారుతోంది. ఆలయం పక్కన ఉన్న కాల్వలో వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు నీరు దేవాలయం ఎదుట నుంచి రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆలయం ఎదుట పారుతున్న మురుగు నీరు

జీపీలకు నిధుల మంజూరు

ధారూరు: మండలంలో కొత్తగా నిర్మించడానికి, అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాలకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. పీసీఎంతండా, అల్లాపూర్‌లో గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణం కోసం రూ.20 లక్షలు చొప్పున, ఎబ్బనూర్‌లో అంగన్‌వాడీ భవనానికి రూ.8 లక్షలు, గడ్డమీదిగంగారం, గట్టెపల్లి, మున్నూరుసోమారం గ్రామాల్లో అసంపూర్తి గ్రామ పంచాయతీ భవనాలను పూర్తి చేసేందుకు రూ.12 లక్షలు, నాగారంలో అసంపూర్తి జీపీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, అంపల్లి, లక్ష్మీనగర్‌తండాల్లో అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరైనట్లు ఎంపీడీఓ వివరించారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

షాద్‌నగర్: మండల పరిధిలోని ఉప్పరిగడ్డ, కంసాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం బీజేపీ గ్రామ బూత్ కమిటీలను పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పోలింగ్ బూత్ గ్రామ బూత్ కమిటీ అధ్యక్షులుగా కడావత్ రాజు, శివకుమార్, ఆంగోతు గణేశ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పార్టీ నాయకులు సత్కరించారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న మాజీ ఎంపీపీ కరుణ, ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి

బషీరాబాద్: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కర్ణాటకలోని దంగాపూర్ మఠానికి చెందిన శ్రీగురుదాస స్వామీజీ అన్నారు. యాంత్రిక జీవితంలో మానవులు ప్రశాంతత కోల్పోతున్నారని, తద్వారా అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కర్ణాటక నుంచి శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న స్వామిని జీవన్గీ గ్రామానికి చెందిన పూలతోట రామదాసు మఠం అధ్యక్షుడు దాసరి కృష్ణ, సభ్యులు వీరారెడ్డి, పాండు ఆహ్వానించారు. ఈ మేరకు ఐదు రోజుల పాటు స్వామీజీ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం చివరి రోజు కావడంతో భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎంపీపీ కరుణ, మార్కెట్ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ తదితరులు స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి శిక్ష

నవాబుపేట: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష పడిన సంఘటన నవాబుపేటలో చోటుచేసుకుంది. ఎస్సై అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మండల కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా ముగ్గురు పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జిల్లా సెకండ్ క్లాస్ న్యాయమూర్తి ఒక్కరోజు జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

ఆత్మరక్షణకు యుద్ధవిద్యలు అవసరం



కొందుర్గు: ప్రతి విద్యార్థి యుద్ధ విద్యలో ప్రావిణ్యం పొందాలని ఎస్సై కృష్ణయ్య సూచించారు. షాద్‌నగర్‌లో ఈ నెల 22న నిర్వహించిన రతన్ టాటా మెమోరియల్, సౌత్ ఇండియా కరాటే, కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో కొందుర్గు విద్యార్థులు షఫీన్, వేదాంశ, వైష్ణవి, మేఘన, మైతిలీలు పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్సై అభినందించి సత్కరించారు. విద్యార్థులు చదువుతో పాటు యుద్ధ విద్యలో రాణించాలని, యుద్ధ విద్యలో ప్రావిణ్యం ఉంటే ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ రమేశ్, పోలీసులు పాల్గొన్నారు.



అనంతగిరి: వికారాబాద్ డిపోలో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న డీఎం



తాండూరు రూరల్: అంతారంలో విద్యుత్ దీపాలంకరణలో మెథడిస్ట్ చర్చి



తాండూరు టౌన్: ముస్తాబైన సెయింట్ మార్క్స్ చర్చి



పరిగి: ఆర్టీసీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలో డీఎం తదితరులు

క్రిస్మస్ శోభ.. వెలుగుల ప్రభ

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రార్థన మందిరాలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో చర్చిల వద్ద సందడి వాతావరణం నెలకొంది. బుధవారం ఏసుక్రీస్తును ప్రత్యేక ప్రార్థనలతో కొలిచేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యాయి.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్: ఏడు అడుగుల శాంతాక్లాజ్